www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 19 డిసెంబర్ 2025
5
తిరుపతి



అమ్మవారి ఆలయానికి నోట్ల లెక్కింపు యంత్రం విరాళం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి తిరుచానూరు కెనరా బ్యాంక్ ప్రతినిధులు గురువారం క్యాష్ కౌంటింగ్ మిషన్ ను విరాళంగా ఆలయంలో అందించారు. ఈ మేరకు క్యాష్ కౌంటింగ్ మిషన్ ను ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌కు కెనరా బ్యాంక్ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ మునిచెంగల్ రాయలు పాల్గొన్నారు.

22ఎ పరిష్కారానికి ప్రభుత్వం చొరవ

తిరుపతిలో.. భూవివాదాలు నేరాలు రెండూ ఎక్కువే..!

భూవివాదాల్లో రాజకీయ జోక్యం వద్దు

రెండురోజుల కలెక్టర్ల సమీక్షలో చంద్రబాబు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రెండు రోజుల పాటు కలెక్టర్ల కాన్ఫరెన్స్ అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో జరిగింది. కీలకంగా భూవివాదాలపైనా చర్చ జరిగినట్లు సమాచారం. 22ఎ భూ సమస్యపై అన్ని జిల్లాల నుంచి సమీక్షించారు. ఈ భూముల పరిష్కారానికి ఉన్నతాధికారులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వచ్చే కలెక్టర్ల సమావేశానికి ఈ భూములపైనే సమీక్ష చేయనున్నట్లు చెప్పారు. ఈ భూముల వివాదాల్లో ఎటువంటి రాజకీయ జోక్యం వద్దని, ఏమాత్రం సహించవద్దని కలెక్టర్, ఎస్‌పిలకు ఆదేశాలు జారీ చేశారు. భూవివాదాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు జోక్యం చేసుకున్నారని ఫిర్యాదులు రాకూడదన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఒకవేళ పరిష్కారం కాకపోతే ఆయా మండలాల్లో ఫిర్యాదులను స్వయంగా కలెక్టర్ వెళ్లి పర్యవేక్షిస్తే కిందిస్థాయి వారికి భయం ఉంటుందన్నారు. త్వరలోనే లక్ష పాస్‌పుస్తకాల ముద్రణ పూర్తయి రైతులకు ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్, ఆస్తి పత్రాలపై డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. గత ప్రభుత్వ పాలన అస్తవ్యస్థంగా ఉండటం వల్ల భూ ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయన్నారు. భూ సమస్యలు వందశాతం పరిష్కరించి, సవినయంగా డాక్యుమెంట్లను కలెక్టర్లు ఇవ్వాలన్నారు. పట్టణాల్లో రెండుసెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాలను ఇచ్చి ఇళ్లు కట్టించేలా సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం ఇచ్చి ఉన్న స్థలాలు దూరమైతే వాటిని రద్దు చేసి, అందుబాటులో ఇచ్చేలా చూడాలన్నారు. తిరుపతిలో 1+3 తరహాలో అపార్టుమెంట్లు నిర్మిస్తే ఎలా ఉంటుందో పరిశీలించాలన్నారు. ఇరవై ముప్పై ఏళ్లుగా నివసిస్తున్నవారికి వ్యక్తిగత సొంతింటికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాల వారీగా రెవెన్యూ రిసిప్ట్‌లపై దృష్టి పెట్టి రెవెన్యూ పెంచాలన్నారు.

శాంతిభద్రతల విషయమై మాట్లాడుతూ రాష్ట్రంలో గతంతో పోలిస్తే 5.5శాతం నేరాలు తగ్గుమొహం పట్టాయని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. రాష్ట్రంలో 16 జిల్లాల్లో నేరాలు బాగా తగ్గాయని, మిగిలిన చోట్ల వివిధ కారణాల రీత్యా క్రైం ట్రెండింగ్ పెరుగుతోందన్నారు. అన్నమయ్య, కోనసీ, నెల్లూరు, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో నేరాలు ఎందుకు పెరిగాయో విశ్లేషించాలన్నారు. నెల్లూరులో లేడీ డాన్స్ గంజాయి వ్యాపారం చేయడం, అడ్డొచ్చిన వారిని చంపేయడం ఏంటని సిఎం సీరియస్ అయ్యారు. సినిమా తరహాలో ఇలాంటి వ్యవహారాలు ఉంటే శాంతిభద్రతల విషయంలో సీరియస్‌గా తీసుకోవాలన్నారు. తప్పుచేసిన వారికి పోలీసులు అంటే ఏంటో భయం కల్పించాలన్నారు. ముఖ్యంగా తిరుపతిలో భూవివాదాలు, శాంతిభద్రతల సమస్యలపైనా చర్చ నడిచినట్లు తెలుస్తోంది.

పేదల ఇళ్ల స్థలాలను కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆక్రమణదారుని నుంచి పేదల ఇళ్లస్థలాలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలం గాంధీ పురం పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 13 లో ఒక ఎకరా తొమ్మిది సెంట్లు భూమిలో 2013లో 32 మంది మధుసూదన్ రెడ్డి దగ్గర ఇళ్ల స్థలాలు కొనుగోలు చేశారన్నారు. ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న సందర్భంలో 2016లో కోడూరు ప్రాంతానికి చెందిన రామసుబ్బారెడ్డి ఈ భూమి తనదని దౌర్జన్యంగా చొరబడ్డాడన్నారు. బాధితులు 32 మంది కలిసి తాము ఈ భూమి కొనుగోలు చేశామని ఆధారాలతో సహా చూపించడంతో వెళ్లిపోయాడన్నారు. 2023లో శేషగిరి స్వామి రంగప్రవేశం చేసి ఈ భూమి తనదని, తనకు టైటిల్ డిక్లేర్ అయ్యిందని వచ్చాడు. బాధితులు మరోసారి తిరగబడడంతో వెళ్లిపోయాడన్నారు. బాధితులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించగా ఇరుగ్రూపులవారు అందులో ప్రవేశించవద్దని తెలిపారన్నారు. అయితే రామసుబ్బారెడ్డి రౌడీలను అడ్డు పెట్టుకుని బాధితులు ప్రవశించకుండా యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారని, ఇరువురూ పోవద్దని చెప్పినా ఏమాత్రం ఖాతరు చేయకుండా నిర్మాణాలు చేపట్టడం వెనుక ఎవరి హస్తం ఉందని ప్రశ్నించారు. ధర్నా అనంతరం ఆర్డీవోకు బాధితులతో కలిసి సిపిఎం నేతలు వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం నాయకులు బుజ్జి, బాధితులు మహేష్, రమేష్, నరసింహ, రామచంద్రారెడ్డి, శంకర, మురగ, హరి, మోహన, సతీష్ ధరణి, వరముని పాల్గొన్నారు.



ఆర్డీవోకు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇస్తున్న బాధితులు

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తిరుపతి జిల్లాలో ఎన్నికలు జరిగిన 744 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం మొదటి విడత టైడ్, అన్ టైడ్ (బేసిక్) గ్రాంట్లు రూ.32,24,48,796 కోట్ల రూపాయలను ఆయా గ్రామ పంచాయతీల యూనియన్ బ్యాంక్ ఖాతాలకు జమ చేశామని జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలదేవి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత టైడ్ గ్రాంటు రూ.19,34,69,270 కోట్ల రూపాయలు, మొదటి విడత అన్ టైడ్ (బేసిక్) గ్రాంట్ గా రూ.12,89,79,526 కోట్ల రూపాయలుగా విడుదల అయినట్లు చెప్పారు. జిల్లాలో తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామపంచాయతీకి అత్యధికంగా రూ.30,42,326 లక్షల రూపాయలు, అత్యల్పముగా పిచ్చాటూరు మండలం అప్పలరాజు కండ్రిగ గ్రామపంచాయతీకి రూ.52,672 వేల రూపాయలు గ్రామపంచాయతీ ఖాతాలకు జమ అయ్యాయని తెలిపారు. 2022 మే 12న పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖఉత్తర్వుల మేరకు టైడ్ గ్రాంటు నుండి 50 శాతం గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణకు, మరో 50 శాతం తాగునీరు, వర్షపు నీటి నిల్వ, నీటి సంరక్షణ, పునరుత్పత్తికి మాత్రమే వినియోగించాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేస్తే ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులపై తీవ్రమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



అంతిమయాత్రలో పాల్గొన్న రామకృష్ణ, మోహనకృష్ణ

ముగిసిన రామచంద్రరాజు అంత్యక్రియలు

ప్రజాశక్తి -తిరుమల: ఉమ్మడి చిత్తూరు జిల్లా టిడిపి సీనియర్ నాయకులు, టిటిడి బోర్డు మాజీ సభ్యులు బి.రామచంద్రరాజు అలియాస్ ఎన్‌టిఆర్ రాజు (83) అంత్యక్రియలు గురువారం ముగిశాయి. వయోభారంతో బుధవారం తిరుమలలోని ఆయన స్వగృహంలో మరణించిన విషయం తెలిసిందే. రామచంద్రరాజుకు నలుగురు కుమారులు - నాశీరు, టిడిపి తెలుగు యువత రాష్ట్రనాయకులు శ్రీధర్ వర్మ మూడవ కుమారుడు. రాజు భౌతికకాయానికి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావుకు వీరాభిమానిగా... అఖిల భారత ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా పని చేశారని గుర్తు చేశారు. టిడిపికి రాజు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అంతిమయాత్రలో నందమూరి తారక రామారావు తనయులు రామకృష్ణ మోహనకృష్ణ, పూతలపట్టు శాసన సభ్యులు మురళీ మోహన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులుతో పాటు టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, మాజీ జెఇఒ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో అధ్యక్షునిగా చెంచురత్నం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఏపీ ఎన్జీవోల సంఘం శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షులుగా చెంచురత్నం యాదవ్ మూడో పర్యాయం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో కొత్తపేటలో ఎన్జీవో కార్యాలయంలో గురువారం ఏపీ ఎన్జీవోల సంఘం శ్రీకాళహస్తి తాలూకా ఎన్నికలు నిర్వహించారు. రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా చేశాననీ, ఈసారీ తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం ఆనందంగా ఉందని చెంచురత్నం యాదవ్ తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తానని పేర్కొన్నారు.



నిఫ్ట్ ద్వారా ఉన్నత భవిష్యత్ అవకాశాలు: నరేష్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ద్వారా యువతకు ఈ పోటీ ప్రపంచంలో ఉన్నత భవిష్యత్తు అవకాశాలను కల్పించబడుతుందని ఇన్స్టిట్యూట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నరేష్, వెంకటేష్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌లో ఉన్న నిఫ్ట్ లో 2026 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లను ప్రారంభించ నున్నామన్నారు. అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు ఫ్యాషన్ డిజైన్, టెక్స్ టైల్ డిజైన్, యాక్సెసరీ డిజైన్, నిట్ వేర్ డిజైన్, లెదర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులను, పీజీ గ్రాడ్యుయేట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అండర్ గ్రాడ్యుయేషన్ లో విద్యార్థులు చేరడానికి పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ లో పాసైన వారు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు అన్నారు. ఇవే కాకుండా సొంతంగా బోటిక్ ఏర్పాటు చేసుకోవాలంటే తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జూలై 26 నుండి అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని, పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పాటు అయిన ఐఐటి, ఐఐఎం తరహాలో నిఫ్ట్ కూడా సొంతంగా డిగ్రీలను ప్రదానం చేసే అధికారం కలిగి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్కాలర్షిప్ సౌకర్యంఉందన్నారు. మంచి ఉపాధి అవకాశాల కోసం నిఫ్ట్ అందిస్తున్న కోర్సులను ఎంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.

నేటినుంచి తిరుపతిలో 'శ్రామిక ఉత్సవ్'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సిఐటియు అఖిల భారత మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకూ జరుగుతున్న నేపథ్యంలో తిరుపతిలో డిసెంబర్ 19 నుంచి 21వ తేదీ వరకూ బొంతాలమ్మ గుడి దగ్గర ఉన్న వినాయకసాగర్‌లో శ్రామిక ఉత్సవ్ జరుగుతుందని కమిటీ గౌరవ అధ్యక్షులు కెవి చౌదరి, కార్యదర్శి ఎం.నాగార్జున, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుబ్రమణ్యం తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ నిర్వహిస్తున్న శ్రామిక ఉత్సవ్ సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంస్కృతిక కళలను ప్రదర్శించడానికి అన్ని రకాల కళాకారులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. మరుగున పడుతున్న సాంస్కృతిక కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పాటలు, దేశభక్తి గీతాలు, అభ్యుదయ పాటలు, నాటికలు, కూచిపూడి నాట్యం, మిమిక్రీ, నృత్యాలు తదితర కళలను ప్రదర్శిస్తారన్నారు. ప్రజలు, కళాకారులు, కార్మికులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సాంస్కృతిక కార్యక్రమాలను జయప్రదం చేయండి



డెల్టా టౌన్‌షిప్స్ అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తిరుపతి నగరంలో వాసుదేవ్ కుటుంబం అనే పేరుతో ఇంటర్నేషనల్ టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని డిజైన్ ఫ్యూచరిస్ట్, డెల్టా టౌన్‌షిప్స్ ప్రతినిధి జిమ్మీ మిస్త్రీ తెలిపారు. గత నెలలో జరిగిన పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో అవగాహన కుదిరిందన్నారు. ఈ మేరకు తిరుపతి పట్టణంలో 1400 ఎకరాల సమగ్ర టౌన్‌షిప్ డెవలప్‌మెంట్ చేయనున్నామన్నారు. ఈ టౌన్‌షిప్‌లో హిందూయిజం, హిందూత్వంపై ప్రపంచంలోని మొదటి ఐదువేల సంవత్సరాల లివింగ్ ఎగ్జిబిషన్ కలిగి ఉందన్నారు. ఏపీ ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ఈ ప్రాజెక్టు రూపొందిస్తున్నామన్నారు. దాదాపు 35వేల కోట్లు ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం అని తెలిపారు. 80శాతం స్థానిక ఉపాధితో 20వేల ఉద్యోగాలు ఉంటాయని చెప్పారు. సింధు లోయనుంచి సమకాలీన హిందూ ఆలోచన వరకూ భారతదేశం నాగరికత ప్రయాణాన్ని ప్రదర్శించడానికి రూపొందించామన్నారు.

21న తిరుమలలో పల్స్ పోలియో

ప్రజాశక్తి - తిరుమల

దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా తిరుమలలో డిసెంబర్ 21వ తేదీ పల్స్ పోలియో కార్యక్రమం జరగనుంది. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం డిసెంబర్ 21న ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. భక్తుల సౌకర్యార్థం తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా 20వ తేది ఉదయం 10 గంటలకు ఎస్వీ హైస్కూల్ నుంచి బాలాజీ నగర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి యాత్రికులు, స్థానికుల కొరకు జీపులో ప్రకటనలు చేస్తూ అవగాహన కలిగించనున్నారు.

'శ్రీ సాయి సుధా'లో ఉచిత బిఎండి పరీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీ సాయి సుధా మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.0 వరకు ఉచిత బియండి పరీక్షలు నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఎముకలు, కీళ్లు నరముల వైద్య నిపుణులు డాక్టర్ బి. సుకుమార్ ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ముంబయి వారిచే ఉచిత పరీక్షలు చేయడంతో పాటు సలహాలు సూచనలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ 45 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఎముకల సాంద్రత పరీక్షించుకోవాలని,ఎముకల సాంద్రత పరీక్షలు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎముకల వైద్యుల్ని కలిసి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు.ఎక్సరే బోన్ డెన్సిటీ టెస్ట్ పరీక్షలతో ఎముకల సాంద్రతను తెలుసుకొని క్యాల్షియం పరిమాణాన్ని సాధ్యమైనంతవరకు ఆహారం ద్వారానే భర్తీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు,ఫిజియోథెరపీ డాక్టర్ సునీత,,సుజాత, మహేష్, శీను,హేమంత్,గౌతమ్, ప్రవీణ్, నరేంద్ర, సిస్టర్స్ సింధ్య,శ్రీలత, మరియు ఇంటస్ ఫార్మా కంపెనీ ప్రతినిధి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'విజనరీకి దక్కిన గౌరవం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎకనామిక్స్ టైమ్స్ ఆఫ్ ఇండియా 2025 బిజినెస్ రీ ఫార్మర్ అవార్డు ఇవ్వడం గొప్ప విజనరీకి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు టీడీపీ సీనియర్ నేత, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాడపల్లి జయచంద్ర నాయుడు అన్నారు. మహిళలకు ఉపాధి, రైతుల కోసం వినూత్న వ్యవసాయ పద్ధతులు, నిరుద్యోగ యువతకు సాంకేతిక రంగాల్లో ఉపాధి, పారిశ్రామికంగా వినూత్న వ్యాపార నమూనాలు, ఆధునిక సాంకేతికత వాడకం, స్థిరమైన వ్యాపారాలు, ఉపాధి కల్పన, పెట్టుబడుల రాక చంద్రబాబు విజనరీకి నిదర్శనాలన్నారు. చంద్రబాబుకు అవార్డు రావడం ప్రతి కార్యకర్తకు గర్వకారణమని పేర్కొన్నారు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి విశాఖకు చెందిన రాజారామ్ కుటుంబం గురువారం రూ. 99 వేలు విరాళంగా అందజేసింది. ఆ మొత్తాన్ని ఆలయ ఏఈవో మోహన్‌కు చెక్కు రూపంలో అందజేశారు. నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాలని సూచించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామీ అమ్మవార్ల దర్శనం కల్పించారు.

సత్యమే గెలిచింది

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు న్యాయస్థానం క్లీన్ చిట్ ఇవ్వడం హర్షణీయమని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి అన్నారు. కోర్టు తీర్పుతో సత్యమే గెలుస్తుందన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడిందన్నారు. కోర్టు తీర్పును స్వాగతిస్తూ గురువారం కాంగ్రెస్ శ్రేణులు పట్టణ వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నాయి. దేశ రాజకీయాల్లో మచ్చలేని కుటుంబం గాంధీల కుటుంబమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, ముని కృష్ణయ్య, నాగరాజు, చరణ్ పాల్గొన్నారు.




క్విజ్ విజేత కడప

వక్తృత్వ పోటీలో తిరుపతి సర్కిల్

21న మంత్రిచే బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కడప జిల్లా విద్యార్థులు, వక్తృత్వ పోటీల్లో తిరుపతి సర్కిల్ విద్యార్థి విజేతలుగా నిలిచారని ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి వెల్లడించారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఇంధన పరిరక్షణ అంశంపై జిల్లా స్థాయిల్లో క్విజ్, వక్తృత్వపు పోటీలను నిర్వహించారు. జిల్లాల పరిధిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అయా జిల్లా కార్యాలయాల ద్వారా ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్ నుంచి బుధవారం సాయంత్రం ఫైనల్ రౌండ్ పోటీలను నిర్వహించారు. క్విజ్ పోటీల్లో కడప జిల్లా నుంచి జీవీవీ నాగిరెడ్డి (10వ తరగతి, ఏపీ మోడల్ స్కూల్, ఖాజీపేట), ఇ. నాగ రిషిత (10వ తరగతి ఏపీ మోడల్ స్కూల్, ఖాజీపేట), వై. ప్రణీత్ రెడ్డి (9వ తరగతి, ఎస్పీ సీఎం మున్సిపల్ హై స్కూల్, రామేశ్వరం, ప్రొద్దటూరు), వి. వైష్ణవి (9 వ తరగతి, వై వి ఎస్ మున్సిపల్ హై స్కూల్, ప్రొద్దుటూరు) బందం విజేతగా నిలిచింది. ఇక ఎస్. అఫీఫా ఫిర్దౌజ్ (9వ తరగతి), ఎంసీ సాయికిరణ్ (9వ తరగతి), పి సమీరా భాను (9వ తరగతి), కె ప్రణీత సాయి శ్రీ యాదవ్ (8వ తరగతి), రవీంద్ర విద్యానికేతన్ కర్నూలు బందం ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే పి. ధాత్రి సాయి (9వ తరగతి), కే. మోక్షిత (9వ తరగతి, జిల్లా పరిషత్ హై స్కూల్, వరిగొండ), జి. రూపిక (9వ తరగతి) ఎస్కే సనీలా (9వ తరగతి, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కావలి) బందం తతీయ స్థానంలో నిలిచింది.



వక్తృత్వపు పోటీల్లో విజేతగా తిరుపతి సర్కిల్

ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో తిరుపతి సర్కిల్ గూడూరులోని సిఎస్ ఎం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జె. అద్రిజా రావు మొదటి స్థానంలో నిలువగా, చిత్తూరు జిల్లా పైపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కే. మనీషా ద్వితీయ స్థానంలోనూ, అనంతపురం జిల్లాలోని లక్ష్మీ ఎనర్జీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న టి. యశస్విని తతీయ స్థానంలో నిలిచారు.

ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా తిరుపతిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న బి. గుర్రప్ప, ఎన్. సౌజన్య, ఇ. లత. ఎస్. కోదండపాణి, కే. మేఘనాథ్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ఆర్ డి), కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆది శేషయ్య, పి. హెచ్. జానకిరామ్, జనరల్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు 21న బహుమతుల ప్రదానం

ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 20, 21వ తేదీల్లో తిరుపతి పాత తిరుచానూరు రోడ్డులోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ నందు సైన్స్ ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ పోటీలను నిర్వహిస్తామని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి వెల్లడించారు. క్విజ్, వక్తృత్వపు, స్టాల్స్ నిర్వహణ పోటీల్లో విజేతలకు ఈనెల 21వ తేదీన రాష్ట్ర ఇంధన శాఖామాత్యులు గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఐఐటీలో ఉత్కంఠంగా కొనసాగుతున్న క్రీడలు

ప్రజాశక్తి -ఏర్పేడు



ఐఐటి తిరుపతిలో జరుగుతున్న 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్ ఐదో రోజు చెస్, టెన్నిస్ క్రీడలలో వివిధ ఐఐటీలు ఆధిపత్యం కోసం హోరాహోరీగా పోటీ పడుతున్నాయి. వెయిట్ లిఫ్టింగ్ పోటీలు బుధవారం ముగిశాయి. ఐఐటి రూర్కి వెయిట్ లిఫ్టింగ్ లో ఛాంపియన్ గా నిలిచింది. టెన్నిస్, చెస్ క్రీడలు కొనసాగుతున్నాయి. టెన్నిస్ క్వాటర్ ఫైనల్స్ గురువారం ప్రారంభమయ్యాయి.చెస్ నాలుగో రౌండ్ తర్వాత కొనసాగుతూ ఐఐటి ఖారగ్పూర్ మొదట స్థానంలోను, ఐఐటి బాంబే రెండవ స్థానంలోనూ, ఐఐటి మూడవ స్థానంలోనూ ప్రతిభను కనబరుస్తున్నాయి. ఐఐటీలో ఫుడ్ కౌంటర్స్ ప్రత్యేక ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి.



ప్రత్యేక ఆకర్షణంగా దర్శనమిస్తున్న ఫుడ్ కౌంటర్స్

మరో మైలురాయిని అధిగమించిన వీఆర్వీ

ఈజిప్ట్‌కు భారీ లిక్విడ్ నైట్రోజన్ ట్యాంక్‌ను ఎగుమతి చేసిన శ్రీసిటి పరిశ్రమ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: శ్రీసిటీలోని క్రయోజెనిక్ ట్యాంకుల తయారీ అగ్రగామి సంస్థ యూఎస్ఏ చార్ట్ ఇండస్ట్రీస్‌కు చెందిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ, అత్యాధునిక క్రయోజెనిక్ సాంకేతికతతో తయారైన భారీ లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఈజిప్ట్‌లోని ప్రముఖ సంస్థ ఎయిర్ లిక్విడ్‌కు ఎగుమతి చేయడం ద్వారా మరో ప్రధాన మైలురాయిని అధిగమించింది. 531 కిలోలీటర్ల సామర్థ్యం, 168 టన్నుల బరువు, సుమారు 39 మీటర్ల పొడవు, 5.45 మీటర్ల వ్యాసం కలిగిన ఈ ట్యాంక్ క్రయోజెనిక్ ఇంజినీరింగ్‌లో అత్యున్నత ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ భారీ నిర్మాణాన్ని చెన్నై పోర్ట్‌కు తరలించేందుకు ప్రత్యేక మల్టీ-యాక్సిల్ లాజిస్టిక్స్‌ను వినియోగించారు. ఈ ఎగుమతిని 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి గొప్ప విజయంగా అభివర్ణించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ప్రపంచ స్థాయి క్రయోజెనిక్ ఇంజినీరింగ్‌లో విఆర్‌వి ప్రతిభను బలపరుస్తుందన్నారు. శ్రీసిటీలో మొట్ట మొదటి కంపెనీగా అడుగుపెట్టిన విఆర్‌వి, స్థానిక అంతర్జాతీయ స్థాయిలో ఏరోస్పేస్, హెల్త్‌కేర్ వంటి కీలక రంగాలకు తమ ఉత్పత్తులను సరఫరా చేసే గ్లోబల్ సంస్థగా ఎదిగింద న్నారు. ఇస్రోతో భాగస్వామ్యం,



కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రాణాలను కాపాడే ఆక్సిజన్ మౌళిక వసతుల సరఫరా వంటి ఘన చరిత్ర కలిగిన విఆర్‌వి, తాజా ఎగుమతితో క్రయోజెనిక్ టెక్నాలజీలో ప్రపంచ స్థాయిలో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

తొట్టంబేడు యూటీఎఫ్ కమిటీ ఎన్నిక



అధ్యక్షులు సూర్య, ప్రధాన కార్యదర్శి రవికు మార్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : యూటీఎఫ్ తొట్టంబేడు మండల కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణం లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠ శాలలో గురువారం తొట్టంబేడు మండల మహాసభను నిర్వహించారు. అధ్యక్షులుగా ఏ.సూర్య, ప్రధాన కార్యదర్శిగా బి.రవికుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ సహాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, శిరీష, కోశాధికారిగా రామకృష్ణలు ఎన్నికయ్యారు. కుమారస్వామి, జి.శ్రీనివాసులు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ అవిశ్రాంతంగా పోరాడుతుందని అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి : పాశం



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న పేదలకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ సూచించారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. రోగులను పరామర్శించి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వైద్య సేవలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. మరికొన్ని మౌలిక వసతులు కావాలని తెలియజేశారని కలెక్టర్‌తో మాట్లాడి వాటిని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హాస్పిటల్ చైర్మన్ రమేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, పరమేశ్వర మంగళం, హరిజనవాడ శ్మశాన వాటికకు వెళ్లే దారి సమస్యను గ్రామ ప్రజలు నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారీ చేసి, పంచాయతీ నిధుల మంజూరుకు చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య ఆధ్వర్యంలో రూ.1.5 లక్షలతో పరమేశ్వరమంగళం పంచాయతీ శ్మశాన వాటిక దారికి గ్రావెల్ మట్టితో రోడ్డు అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షులు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్, మాజీ సర్పంచ్ జయరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సుధాకర్ నాయుడు, హిందుపతి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల కేంద్రంలోని వాకాడు-1 రైతు సేవ కేంద్రంలో మండల టీడీపీ నాయకులు దువ్వూరు మధుసూదన రెడ్డి దిత్వా తుపానుతో నష్ట పోయిన రైతులకు 80 శాతం రాయితీపై కెఎన్ఎం1638 రకం వరి విత్తనాలను గురువారం అందించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎం.దీప మాట్లాడుతూ మండల పరిధి లోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో 670 క్వింటాళ్ళ వరి విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నందగోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, భార్గవ రామ్, గ్రామవ్యవసాయ సహాయకులు దినేష్, రైతులు పాల్గొన్నారు.

తాగు నీటి అక్రమ వాడకంపై చర్యలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని వెస్ట్ వరత్తూరు గ్రామంలో, నంబాల లక్ష్మీ తన తోటలోని చెట్లకు గ్రామంలోని తాగునీటిని వాడుతోందని, తాగునీటి వాడకాన్ని ఆపాలని ఎంపీ డీఓ వెంకటరత్నమ్మకు ముని చంద్రారెడ్డి, గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంబాల లక్ష్మీ గ్రామ కంచానికి సంబంధించిన భూమిలో టేకు, టెంకాయ, మామిడి, నేరేడు తోటలను పెంచుతూ పంచాయతీకి సంబంధించిన తాగునీటి పైపులైన్ వేసుకుని వాడుతోందని తెలిపారు. దీంతో తాగు నీరు చాలక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తాగు నీటి వాడకంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ వెంకట రత్నమ్మ తాగునీరు వృథా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

కాలువలపై నిర్మాణాల తొలగింపుపై అభ్యంతరాలు



డ్రైనేజీ కాలువలపై బండలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణం, కార్వేటినగరం రోడ్‌లో డ్రైనేజీ కాలువల శుభ్రపరిచే పనులు చేపట్టాలని గురువారం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. చిన్నపాటి వర్షానికే మురుగు నీరు రోడ్లపైకి చేరుతోందని, ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా ఈ చర్యలు అవసరమని మున్సిపాలిటీ అధికారులు పేర్కొన్నారు. డ్రైనేజీ ప్రవాహానికి ఆటంకంగా మారిన ఆక్రమణలు, అడ్డంకులను తొలగించి నీటి నిల్వ లేకుండా ప్రవహించేలా చేయాలని సంకల్పించారు. ఈ క్రమంలో కాలువలపై ఉన్న నిర్మాణాలను తొలగించే పనులు ప్రారంభించారు. అయితే, స్థానిక వ్యాపారులు తమ సమస్యను మానవీయ కోణంలో పరిశీలించాలని కోరుతున్నారు. గతంలో ఇదే డ్రైనేజీ కాలువలు శుభ్రపరిచే సమయంలో వ్యాపార దుకాణాల ముందున్న బండలను మున్సిపాలిటీ అధికారులు స్వయంగా ఏర్పాటు చేశారని, ఇప్పుడు వాటిని తొలగించి మళ్లీ ఏర్పాటు చేయడం తమకు ఆర్థికంగా, జీవనోపాధి పరంగా ఇబ్బందులకు దారితీస్తుందని కమిషనర్‌కు తెలియజేశారు. పరిస్థితిని సమీక్షించి, నిబంధనల మేరకు ఇరుపక్షాలకు న్యాయం జరిగే విధంగా పరిష్కారం చూపేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

దివ్యాంగులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, త్యాగరాజ వీధి, శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో సనిశెట్టి వెంకట శ్రీధర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు గురువారం దుస్తులు పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ సంస్థ నిర్వాహకులు సుధీర్ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

అదనపు సన్నిధి గొల్లల పోస్టులు శుభపరిణామం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల శ్రీవారి ఆలయంలో అదనపు సన్నిధి గొల్లల పోస్టులు ఏర్పాటు చేస్తూ టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని, పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సన్నిధి గొల్లకు ఎంతో ఊరట కలిగించిన టిటిడి బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడుకు, సీఎం చంద్రబాబు నాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అఖిల భారత యాదవ మహాసభ తిరుమల అధ్యక్షులు శీనుయాదవ్ పేర్కొన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షులు శంకర్ యాదవ్, యాదవ సంఘాల నాయకులతో కలిసి శీనుయాదవ్ మాట్లాడారు. ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. శంకర్ యాదవ్, రమణ యాదవ్ మాట్లాడుతూ తిరుమలలో శరభయ్య మఠం, అన్నమయ్య మఠం ఏర్పాటు చేయాలని, అలానే వకుళామాత జీవిత చరిత్ర, శరభయ్య, అన్నమయ్య జీవిత చరిత్ర నమూనాలను తిరుమలలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ తిరుపతి జిల్లా అధ్యక్షులు శరత్ యాదవ్, వెంకటాద్రి యాదవ్, సుబ్బు యాదవ్, సతీష్, సునీల్ యాదవ్ పాల్గొన్నారు.

జీపీ హిందూజాకు ఘన నివాళి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఇటీవల మరణించిన హిందూజా గ్రూప్ చైర్మన్ గోపీచంద్ పి హిందూజా జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ప్రార్థనా సమావేశం నిర్వహించి, ఘన నివాళి అర్పించారు. ఈ సమావేశానికి పారిశ్రామిక దిగ్గజాలు, పార్టీలకు అతీతంగా రాజకీయ రంగానికి చెందిన స్నేహితులు, దౌత్య బంద సభ్యులు, పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. పరమార్థ నికేతన్‌కు చెందిన చిదానంద సరస్వతి వంటి ఆధ్యాత్మిక వేత్తలు, సన్నిహితులు మొదలైనవారు జీపీ హిందూజా విభిన్నమైన వ్యక్తిత్వం గురించి తెలుపుతూ ఘనంగా నివాళులర్పించారు. ఆయనకు ప్రియ మిత్రుడు దివంగత రాజ్ కపూర్‌పై చిత్రీకరించిన పాటలను ఆలపించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు వెల్లడించారు.

ఘనంగా కింజరాపు రామ్మోహన నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు జన్మదిన వేడుకలను ప్రణీత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్ పెనుమాదు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా ప్రణీత్ పెనుమాదు సూచనల మేరకు ప్రణీత్ ఫౌండేషన్ సభ్యులు తిరుచానూరు ఘంటసాల విగ్రహం కూడలి వద్ద ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపుగా 700 మంది పేదలకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణీత్ ఫౌండేషన్ సభ్యులు రాజేష్, నాని, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిని కలసిన ప్రణీత్

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు పుట్టినరోజు పురస్కరించుకొని ప్రణీత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్ పెనుమాదు ఢిల్లీలోని రామ్మోహన నాయుడు కార్యాలయంలో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి రామ్మోహన నాయుడును దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

టేకు సంపదకు చెదలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తి తహశీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న బ్రిటీష్ కాలం నాటి బర్మా టేకుకు చెదలు పడుతోంది. పాత కార్యాలయానికి వినియోగించిన ఈ విలువైన టేకును దాన్ని కూల్చి కొత్త భవనాన్ని నిర్మించే క్రమంలో ఉప ఖాజానా కార్యాలయం ముందు ఉంచేశారు. ఏళ్ల తరబడి అలాగే ఉంచేయడంతో చెదలు పట్టి ఎందుకూ కొరగాకుండా పోతోంది. పైగా టేకు దుంగలు పాములు, విష పురుగులకు ఆవాసాలుగా మారడంతో తహశీల్దార్ కార్యాలయ సిబ్బందితో పాటు ఉప ఖాజానా కార్యాలయ సిబ్బంది సైతం ఆందోళన చెందుతున్నారు. టేకును ఇప్పటికే వేలం వేసి ఉంటే లక్షల ఆదాయం ప్రభుత్వానికి వచ్చేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరుతున్నారు.


బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) కేంద్ర ప్రభుత్వం కులగణన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేక కమిషన్‌తో కులగణన జరగాలని, నమోదు చేసిన గణనపకారం బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు చందు డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ కాలంలో జరిగిన కులగణన తర్వాత ఇప్పటివరకు వెలుగుబడిన తరగతులకు చెందిన వారికి కులగణన చేపట్టలేదని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లతో పాటుగా మహిళలకు సబ్ కోటా ఇవ్వాలన్నారు. కుల గణన జరిగిన తరువాతనే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ డిమాండ్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా 29న అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో భానుప్రకాష్, వెంకటేష్ పాల్గొన్నారు.

సీఐ కోచింగ్‌తో 12మంది కానిస్టేబుల్స్ ఎంపిక


ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తురక కాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిఐ వెంకటరమణ 100 మందియితే పైగా నిరుపేదలైన విద్యార్థులకు నెల్లూరులో కానిస్టేబుల్ ఎంపికకు ఉచిత కోచింగ్ ఇవ్వడం జరిగింది. వారిలో 12 మంది కానిస్టేబుల్స్‌గా ఎంపిక అయ్యారు. వీరిలో 5 మంది మహిళాలు ఉన్నారు. సిఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్ఈ డిపార్ట్మెంట్‌లో గ్రూప్ డి కి ఎంపికయ్యారు. ఈ నేపధ్యంలో వారు పల్నాడు జిల్లా మాచర్ల టౌన్ సిఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణను గురువారం సన్మానించారు. కోచింగ్ నిర్వహణకు సహకారం అందించిన ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్యకు సీఐ ధన్యవాదాలు తెలిపారు.

సిద్ధార్థలో ఐడియాథాన్-2025 విజయవంతం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సిఎస్ఈ) విభాగం ఆధ్వర్యంలో గురువారం ఐడియాథాన్-2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టిఐహెచ్), తిరుపతి వారి సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 బ్యాచ్‌లకు చెందిన 90 మంది విద్యార్థులు పాల్గొని, తమ స్టార్టప్ ఐడియాలు, సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఐహెచ్ బృందానికి చెందినలి పి.సిల్వియా, పి.వినోద్ కుమార్, కె.వీరేంద్ర సాయి, ఎం.శ్రీనివాస్ వంటి నిపుణులు పాల్గొని పలు సూచనలు చేశారు.

ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



ప్రజాశక్తి - తడ: తడ మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక సమావేశం మండల అధ్యక్షులు రాంబాబు అధ్యక్షతన గురువారం తడ కండ్రిగ పాఠశాలలో నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా తిరుపతి జిల్లాకార్యదర్శి ప్రభాకర్ పర్యవేక్షణలో గౌరవాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్లును, అధ్యక్షులుగా కే.సుధాకర్‌ను, ఉపాధ్యక్షులుగా కేటీ నవీన్ కుమార్, పి కాంచన, ప్రధాన కార్యదర్శిగా కే.రాంబాబు, కోశాధికారిగా ఎం.రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా బి.సతీష్ బాబు, కె.భువనేశ్వరి, ఎన్ రామ్మూర్తి, వైవి రమణయ్య, ఎ సీనమ్మ,ఎం రమణయ్య ఎం రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. జిల్లా కౌన్సిలర్ లుగా యన్ రవికుమార్, యన్ శ్రీనివాసులు, యస్ కె సర్దార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తడ మండల యూటిఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓజిలి ఇంచార్జ్ ఎంఆర్ఓగా రాజేంద్ర



ప్రజాశక్తి - ఓజిలి: భూ వివాదాలలో సిజిఆర్ఎస్‌లో సస్పెండ్ అయిన ఓజిలి ఎమ్మార్వో స్థానంలో నాయుడుపేట ఎమ్మార్వో మాగర్ల రాజేంద్ర ఇంచార్జ్ ఎమ్మార్వోగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రజా సమస్యలపై దృష్టి పెడతామన్నారు.

రెడ్డివారి గురవారెడ్డికి సన్మానం


ప్రజాశక్తి-ఏర్పేడు: ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమితులైన రెడ్డివారి గురవారెడ్డిని టిడిపి మండల అధ్యక్షులు పేరు నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు గురువారం కేక్ కట్ చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పేరం ధనంజయులనాయుడు, శివ శంకర్ రెడ్డి, పాపిరెడ్డి, కృష్ణవేణి, రాచేటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యువతరం ఫౌండేషన్ సేవలు నవతరానికి నాంది కావాలి



ప్రజాశక్తి - బాలాయపల్లి : యువతరం ఫౌండేషన్ సేవలు సమాజంలో నవతరానికి నాంది కావాలని బాలాయపల్లి మండల విద్యాశాఖ అధికారులు బి.నాగేశ్వరరావు, ప్రదీప్ కుమారులు వెల్లడించారు. గురువారం యువతరం ఫౌండేషన్ చైర్మన్ చంద్రగిరి శ్రీనివాసుల ఆధ్వర్యంలో బాలాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు యువతరం ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాసులు, ఎంఈఓలు నాగేశ్వరరావు, ప్రదీప్ కుమార్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ 1 నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రోత్సాహం అందించే దిశగా యువతరం ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మండల పరిధిలోని పచ్చారి చేను గ్రామానికి చెందిన శ్రీనివాసులు సొంత మండలంలో ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో తన ఫౌండేషన్ ద్వారా సేవలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. దివ్యాంగులు అని బాధపడకుండా విద్యలో రాణించి ఉన్నత స్థాయికి చేరాలని తెలిపారు. ఎంఈఓ 2 ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ప్రత్యేకంగా గుర్తుంచుకొని యువతరం ఫౌండేషన్ చేస్తున్న సేవలు చిరస్మరణీయం అన్నారు. యువతరం ఫౌండేషన్ చైర్మన్ చంద్రగిరి శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో గత ఐదు సంవత్సరాల నుండి తన ట్రస్టు ద్వారా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే వెంకటగిరి ,గూడూరు, నెల్లూరు నియోజకవర్గాల్లో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. తన సొంత మండలం అయిన బాలాయపల్లి లో సేవా కార్యక్రమాలను అందించేందుకు అభం శుభం తెలియని దివ్యాంగుల పిల్లలతో కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, దేవసేనమ్మ, భవిత ఇంచార్జ్ శోభారాణి, ఉపాధ్యాయులు లక్ష్మి, బహుత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో ఉపాధ్యక్షులుగా రమేష్ రెడ్డి



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: ఏపీ ఎన్జీవోల సంఘం శ్రీకాళహస్తి తాలూకా ఉపాధ్యక్షులుగా శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో కొత్తపేటలో ఎన్జీవో కార్యాలయంలో గురువారం ఏపీ ఎన్జీవోల సంఘం శ్రీకాళహస్తి తాలూకా ఎన్నికలు నిర్వహించారు. తనని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం ఆనందంగా ఉందని రమేష్ రెడ్డి తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ


ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరిలో మహిళలకు ఉచితంగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇవ్వనుంది. ఈ శిక్షణ 31 రోజులపాటు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుండి 50 సంవత్సరాల మధ్య వయసు మహిళలు అర్హులని తెలిపారు. 10వ తరగతి పాసై ఉండాలన్నారు. శిక్షణాకాలంలో ఒక పూట భోజన వసతి ఏర్పాటు చేస్తామని, శిక్షణ అనంతరం సర్టిఫికేట్‌తోపాటు టూల్ కిట్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్‌లు, 4 పాస్‌పోర్టు ఫోటోలు తీసుకుని చంద్రగిరి కొత్తపేటలోని సంస్థను సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 9494951289, 7989680587 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మండలం, కాపులూరు జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే కాపులూరు జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు కాపులూరు చక్రపాణి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు చలంబాబు, ఉపాధ్యాయులు రుద్రకుమార్ పలువురు ఉపాధ్యాయులు తమ పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరచాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాల ఆవరణలో చిన్నపాటి వర్షానికి రెండడుగులు లోతు నీళ్లు విడిచిపోతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల ఆవరణలో భారీ స్థాయిలో నీరు నిలిచిపోవడంతో ఇబ్బంది పడ్డామని తెలిపారు. అలాగే మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కాపులూరు జడ్పీ హైస్కూల్‌లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నిక



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మగళం డిపోకు ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా ఆర్కాట్ కృష్ణ ప్రసాద్‌ని మంగళం డిపో ఉద్యోగస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళం డిపో రోడ్డు దగ్గర నుండి సుమారు 200 మంది ఉద్యోగస్తులు డిపో అధ్యక్షులు శేషాద్రి అధ్యక్షతన ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుసుబ్రహ్మణ్యం రాజు, ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సోనీ వెంకటేష్, మాజీ జిల్లా అధ్యక్షులు గురునాథం పాల్గొన్నారు. వీరిని జిల్లా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి మురుగమ్మ, జోనల్ ఆర్గనైజ్ సెక్రటరీ మనోజ్, జిల్లా అధ్యక్షులు జి.రామచంద్రయ్య, జిల్లా సెక్రటరీ వి,మస్తాన్, డిపో సిసిఎస్ డెలిగేట్ జిల్లా జాయింట్ సెక్రటరీ రఘు తదితరులు పాల్గొన్నారు

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL DISTRICT JUDGE:: TIRUPATI
I.A.No. 222 of 2023
O.S.No. of 2023

Between:
Dr. Tavanati Siddamma ...Petitioner/Plaintiff
And
Erla Niranjan Reddy & others ...Respondent/Defendants

NOTICE TO RESPONDENT NO.4

R4. K. Bhaskar Reddy, S/o Not Known, Residing at D.No. 6-1-248, Road No.4, Post office Road, Varadaraja Nagar,Tirupati Urban Mandal, Tirupati District.

The above case stands posted for your appearance on 03-01-2026 at 10:30 A.M either in person or through counsel else the matter will be decided exparte.

Advocate for Petitioner
D.L.R. BALAKRISHNA SATYAM, LLM.
CH.V.B. MURALI KRISHNA, LLM.
ADVOCATES
42 D.No. 17-3-81 (A), Poola Street
Opp. to Court Buildings, TIRUPATI.
Land line: 0877-2222767
Cell: 9290705268,7285929803.

మహారాజశ్రీ ది సివిల్ జడ్జి కోర్టు (జూనియర్) డివిజన్ కోర్టు : రాజంపేట

O.S.No : 272/2021

తాటిచర్ల రామశర్మ, తండ్రి సుబ్బారామ మూర్తి, 72 సం., హిందూ, రిటైర్డ్ ఉద్యోగి, ప్లాట్ నెం:401, ఆర్చిడ్ స్ప్రింగ్ అపార్ట్మెంట్, ఎస్.బి.ఐ కాలనీ, బిల్డప్ దగ్గర, కడప సిటీ మరియు జిల్లా. **...వాది**

Vs

7. సి.లీలావతమ్మ, భర్త యన్.శ్రీనివాసులు రెడ్డి, 42 సం., హిందూ, గృహిణి మరియు వ్యవసాయం, డోర్ నెం: 19-8-169/4, ఎస్.బి.ఐ కాలనీ, తిరుపతి టౌన్ (అర్బన్), చిత్తూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లా. **...7వ ప్రతివాది**

వాది దావాలో 7 వ ప్రతివాది ఐన మీపై రాజంపేట సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) నందు క్రింద తెలిపిన షెడ్యూల్ దాఖలా ఆస్తిలో భాగ పరిష్కారం మరియు ఇంజక్షన్ ఆర్డర్ కోరుచూ ఓ.ఎస్ నెం:272/2021 దావా దాఖలు చేసియున్నారు. సదరు కేసులో ఏ విధమైన ఆక్షేపణలు ఉన్నయడల ది సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) రాజంపేట కోర్టు నందు 22-12-2025 వ తేదీన ఉదయం 10:30 గంటలకు హాజరై మనవి చేసుకోగలరు. లేనంతట పరోక్షమందు తీర్మానించబడెదరు.


షెడ్యూల్

కడప జిల్లా ప్రస్తుతం అన్నమయ్య జిల్లా, రాజంపేట సబ్-డిస్ట్రిక్ట్, తాళ్లపాక గ్రామపంచాయతీ పరిమిం, తాళ్లపాక గ్రామ పొలంలో ఉన్న భూమి వివరం 1.సికార్ పంజి సర్వే నెం:306/1 విస్తీర్ణం: ఎ.0.81 సెంట్లు, 2.సికార్ పంజి సర్వే నెం:307/1 విస్తీర్ణం: ఎ.0.04 సెంట్లు, మొత్తం విస్తీర్ణం : ఎ.0.85 సెంట్లు. హద్దులు : తూ॥: పీర్ల మన్యం మరియు ఇతరులకు చెందిన భూమి. ప॥: ఎగ్జికుటెంట్ చెందిన భూమి (జిమిను), ఉ॥: ఎగ్జికుటెంట్ చెందిన భూమి (కయ్య), ద॥: కాలువ పోరంబోకు.

యం.సురేష్ కుమార్
వాది పరం అడ్వకేట్, కడప.

క్రైం న్యూస్

బెల్ట్ షాపు నిర్వహణ కేసులో జ్యోతి అరెస్ట్



ప్రజాశక్తి - రామచంద్రపురం : మండల పరిధిలోని కట్టకింద వెంకటాపురంలో బెల్ట్ షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మండల వైసీపీ మహిళా అధ్యక్షురాలు పంచవతి జ్యోతిని ఆర్‌సి పురం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. తన దుకాణంలో వ్యాపారం చేసుకుంటూ, అక్రమంగా బెల్టు షాపు నిర్వహించి మద్యం బాటిల్స్‌ను బుధవారం మందు బాబులకు విక్రయిస్తున్న విషయాన్ని గ్రామ సచివాలయ మహిళా కార్యదర్శి ఎస్.భాగ్యం, ఆర్‌సి పురం ఎస్సై భక్తవత్సలానికి సమాచారమిచ్చింది. దీంతో ఎస్సై తన సిబ్బందితో దుకాణంలో తనిఖీలు నిర్వహించగా విఎస్ఓపి 5 క్వార్టర్లు, బెంగళూరు విస్కీ 11 క్వార్టర్లు లభ్యమయ్యాయి. వీఆర్వో నరసింహులు సమక్షంలో పంచనామా నిర్వహించారు. పంచవతి జ్యోతి సోదరులు పోలీస్ శాఖలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారనే ధైర్యంతో, వారి అండదండలతో గత కొన్నేళ్లగా మద్యం బెల్ట్ షాప్ నిర్వహిస్తోంద ఎస్ఐ తెలిపారు. గతంలో కూడా పుత్తూరు ఎక్సైజ్ పోలీసులు ఆమె షాపును తనిఖీ చేసి, అక్రమ మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై అంజాద్ బాషా తెలిపారు. ఆమెను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భక్తవత్సలం తెలిపారు.

బైక్‌లను ఢీ కొట్టిన అపాచీ బస్సు



ప్రజాశక్తి - తడ: తడ మండలం, కాదలూరు సమీపంలో నేషనల్ హైవేపై గురువారం ఉదయం అపాచీ బస్సు ఆపివున్న మూడు బైక్‌లను ఢీకొట్టింది. అనంతరం హైవే ప్రక్కనున్న కాలువ సమీపంలో ఆగింది. స్థానికుల సమాచారం మేరకు బూదూరు నుండి అపాచీ పరిశ్రకు కార్మికులను తీసుకు వస్తున్న సూర్య ట్రావెల్స్ బస్సు అతి వేగంగా దూసుకొచ్చింది. కాదలూరు సమీపంలో మరో బస్సులో కార్మికులు ఎక్కుతున్నారు. అదే బస్సు వెనుక మూడు బైక్‌లతో కార్మికులు ఆగి మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో హైవేపై వెళుతున్న లారీ ఆగివున్న బస్సును క్రాస్ చేస్తున్న సమయంలో, బూదూరు నుండి వస్తున్న బస్సు వీటిని తప్పించబోయి, ఎడమ వైపుకు వచ్చి మూడు బైక్‌లను ఢీ కొట్టి, పక్కనే ఉన్న కాలువ చివరికి వచ్చి ఆగింది. బస్సులోని కార్మికులు ఆర్తనాదాలు చేయడంతో చుట్టూ పక్కల వారు, తోటి కార్మికులు కలిసి జాగ్రత్తగా దించారు. మూడు బైక్‌ల వద్ద ఉన్న ఆరుగురులో, నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. తడ పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నదిలోకి దూసుకెళ్ళిన ఆటో



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, తొండవాడ దగ్గరలో ఉన్న స్వర్ణముఖినది వంతెనలోకి ప్రమాద వశాత్తు ఆటో దూసుకెళ్ళింది. వివరాల్లోకి వెళితే గురువారం ఓఆటో చంద్రగిరి నుంచి తిరుపతికి వెళుతుండగా మార్గమధ్యంలోని ముక్కోటి స్వర్ణముఖినది వంతెన వద్ద అదుపు తప్పి దూసుకెళ్ళి నదిలో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. చంద్రగిరి, తిరుపతి రహదారిలోని ముక్కోటి వద్ద ఉన్న వంతెనపై రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడ లేక పోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించారు.

ఆదవరం అటవీ పరిధిలో ఎర్రచందనం స్వాధీనం



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మండలం ఆదవరం అటవీ పరిధిలో 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లరును టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి ఒక ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ అధ్వర్యంలో. ఎఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఎఆర్ఎస్ఐ కే.మహేశ్వర నాయుడు టీమ్ స్థానిక ఎఫ్బీఓ పి. దామోదరరావుతో కలసి చెల్లూరు డ్యాం నుంచి బుధవారం రాత్రి నుంచి కూంబింగ్ చేపట్టారు. వీరు ఆదవరం అటవీ ప్రాంతంలోని తీర్థాలపాల కోన వద్దకు చేరుకోగా, అక్కడ కొంత మంది వ్యక్తులు గుమికూడి కనిపించారు. వారిని సమీపించి చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు టాస్క్ ఫోర్సు పోలీసులను చూసి పారిపోసాగారు. అయితే పోలీసులు ఒకరిని పట్టుకోగలిగారు. అతనిని కర్నాటకకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆ పరిసరాల్లో వెతకగా 6 ఎర్రచందనం దుంగలు, ఆ వ్యక్తి ఉపయోగించిన ద్విచక్ర వాహనం కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని, పట్టుబడిన వ్యక్తితో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన వ్యక్తిని డీఎస్పీ వీ. శ్రీనివాసరెడ్డి, ఎసీఎఫ్ జె.శ్రీనివాస్ విచారించారు. ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహారాజశ్రీ ది సివిల్ జడ్జి కోర్టు (జూనియర్) డివిజన్ కోర్టు : రాజంపేట

I.A.No : 536/2021 in
O.S.No : 272/2021

తాటిచర్ల రామశర్మ, తండ్రి సుబ్బారామ మూర్తి, 72 సం., హిందూ, రిటైర్డ్ ఉద్యోగి, ప్లాట్ నెం:401, ఆర్చిడ్ స్ప్రింగ్ అపార్ట్మెంట్, ఎస్.బి.ఐ కాలనీ, బిల్డప్ దగ్గర, కడప సిటీ మరియు జిల్లా. **...పిటీషనర్**

Vs

7. సి.లీలావతమ్మ, భర్త యన్.శ్రీనివాసులు రెడ్డి, 42 సం., హిందూ, గృహిణి మరియు వ్యవసాయం, డోర్ నెం: 19-8-169/4, ఎస్.బి.ఐ కాలనీ, తిరుపతి టౌన్ (అర్బన్), చిత్తూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లా. **...7వ రెస్పాండెంట్**

పిటీషనర్ పిటీషన్‌లో 7వ రెస్పాండెంట్ ఐన మీపై రాజంపేట సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) నందు క్రింద తెలిపిన షెడ్యూల్ దాఖలా ఆస్తిలో భాగ పరిష్కారం మరియు ఇంజక్షన్ ఆర్డర్ కోరుచూ I.A. NO: 536/2021 in ఓ.ఎస్‌నెం:272/2021 పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు కేసులో ఏ విధమైన ఆక్షేపణలు ఉన్నయడల ది సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) రాజంపేట కోర్టు నందు 22.12.2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు హాజరై మనవి చేసుకోగలరు. లేనంతట పరోక్షమందు తీర్మానించబడెదరు.

షెడ్యూల్

కడప జిల్లా ప్రస్తుతం అన్నమయ్య జిల్లా, రాజంపేట సబ్-డిస్ట్రిక్ట్, తాళ్లపాక గ్రామపంచాయతీ పరిమిం, తాళ్లపాక గ్రామ పొలంలో ఉన్న భూమి వివరం 1.సికార్ పంజి సర్వే నెం:306/1 విస్తీర్ణం: ఎ.0.81 సెంట్లు, 2.సికార్ పంజి సర్వే నెం:307/1 విస్తీర్ణం: ఎ.0.04 సెంట్లు, మొత్తం విస్తీర్ణం : ఎ.0.85 సెంట్లు. హద్దులు : తూ॥: పీర్ల మన్యం మరియు ఇతరులకు చెందిన భూమి. ప॥: ఎగ్జికుటెంట్ చెందిన భూమి (జిమిను), ఉ॥: ఎగ్జికుటెంట్ చెందిన భూమి (కయ్య), ద॥: కాలువ పోరంబోకు.

యం.సురేష్ కుమార్
వాది పరం అడ్వకేట్, కడప.

కృష్ణమ్మ మృతికి నివాళి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని దివిపాలెంలో వైఎస్ఆర్సిపి కార్యకర్త కస్తూరి భాస్కర్ మాతృమూర్తి కస్తూరి కృష్ణమ్మ స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకున్న గూడూరు ఎంపీపీ బూదురు గురవయ్య నివాళి అర్పించి, భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు విద్యాసాగర్, ప్రభాకర్ రాజు, కొట్టు అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశం



ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడుకండ్రిగ మండలం, వెలుగు కార్యాలయంలో గురువారం మండల స్థాయి మహిళా సమాఖ్య సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం రైతు సాధికార సేవా సంస్థ, స్వయం ఉపాధి గ్రామీణ మహిళా సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద కొత్తగా ఎంపికైన గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి షణ్ముగం, వ్యవసాయ విస్తరణ అధికారి మునెయ్య, మండల సమాఖ్య నిర్వాహకురాలు ప్రభావతి, సమాఖ్య సమన్వయకులు, సమాజ వనరుల వ్యక్తులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాల అమలు, రైతుల ఆరోగ్య పరిరక్షణ, మహిళా సంఘాల పాత్ర, గ్రామస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి ఖర్చులు తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



ప్రజాశక్తి-ఏర్పేడు: బండారుపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు కుర్చీలను బహుకరించారు. బండారుపల్లి మాజీ ఎంపీపీ కుమారుడు ప్రభాకర్ రెడ్డి (డి.ఇ,శ్రీకాళహస్తి), పూర్ణచంద్ర రెడ్డి (హెడ్మాస్టర్) ఇరువురు పదివేల రూపాయలు విలువచేసే కుర్చీలను అందజేసి, పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. రాజు వేలు, ఉపాధ్యాయ బృందం సుబ్రహ్మణ్యం, సురేష్, కుమార్ రాజా, వెంకటేష్‌లు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

29 నుండి శ్రీకపిలేశ్వరాలయంలో తెప్పోత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:

తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబరు 29 నుండి జనవరి 2వ తేదీ వరకు తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఐదు రోజులపాటు జరిగే తెప్పోత్సవాలలో మొదటిరోజైన డిసెంబరు 29వ తేదీన శ్రీ వినాయక స్వామివారు, శ్రీ చంద్రశేఖర్ స్వామివారు పుష్కరిణిలో 9 చుట్లు విహరిస్తారు. నవంబరు 30న శ్రీ వళ్ళి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామివారు 9 చుట్లు, డిసెంబరు 31న శ్రీ సోమస్కందస్వామివారు 9 చుట్లు, జనవరి 1న శ్రీ కామాక్షి అమ్మవారు 9 చుట్లు, జనవరి 2న శ్రీ చండికేశ్వరస్వామివారు మరియు శ్రీ చంద్రశేఖర స్వామివారు తెప్పలపై 9 చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు ఊంజల సేవ, తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. జనవరి 3వ తేదీన ఆరుద్ర దర్శన మహోత్సవం సందర్భంగా ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు శ్రీ నటరాజస్వామివారు, శ్రీ శివగామి అమ్మవారు, శ్రీ మాణిక్యవాసగ స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించనున్నారు. తెప్పోత్సవాల సందర్భంగా టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంకీర్తనలు ఆలపిస్తారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



ప్రజాశక్తి -కోట : కోట మండలంలో, తిరుపతి జిల్లా వనరుల కేంద్రం వారి ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సౌభాగ్య లక్ష్మి మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా రైతులకు సాగు ఖర్చు తగ్గడమే కాక ఆహార భద్రతను ఆరోగ్య భద్రతను కలిగిస్తాయని తెలియజేశారు. కోట మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు తప్పక భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగానే పంటలకు ఎరువులను వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వరలకేంద్రం తిరుపతికి చెందిన వ్యవసాయ అధికారులు, సిబ్బంది,కోట మండల రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ప్రేరణ తరగతులు



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు ఫార్మసీ కళాశాల, మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రేరణ తరగతులను విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య టాటా నర్సింగరావు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విశ్వవిద్యాలయంలో ఎలా మెలగాలో, ఎలా విద్యను అవగాహన చేసుకోవాలో వివిధ కోణాల్లో వివరించారు. రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ ఫార్మసీ కళాశాల పురోగతి, ఈ కోర్సు చదవటం వల్ల కలిగే ఉపాధి అవకాశాలను గురించి తెలియజేశారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యలో మెళకువలు, విధి విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీన్, ఆచార్య విజయ సారథి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామానుజపల్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం



ప్రజాశక్తి - క్యాంపస్ : రామానుజపల్లి పంచాయతీలో శ్రీ పద్మావతీ మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సోమవారం ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా గురువారం రామానుజపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం పాండ్ ఇన్ పాండ్ అవుట్ ,రౌండ్ అండ్ బాల్, సిట్ అండ్ స్టాండ్ వంటి వివిధ క్రీడలు, సాంస్కృతిక ఆటలు నిర్వహించారు. అంగన్‌వాడి చిన్నారులకు ఆటలతో పాటు ప్రాథమిక యోగా, మెడిటేషన్ నేర్పించారు.

పరమాచార్య గురుకుల కేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గురువారం స్వర్ణవల్లీ మహా సంస్థానం పీఠాధిపతులు శ్రీగంగాధరేంద్ర సరస్వతీ మహాస్వాములు, పూజ్యశ్రీ శ్రీమదానంద బోధేంద్ర సరస్వతీ స్వాములుచే పరమాచార్య గురుకుల కేంద్రం, గోవింద భగవత్పాద వాక్యార్థ సభ, విశ్వవిద్యాలయ వాక్యార్థసభ, కులపతి వాక్యార్థసభలను విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, ఐ.క్యూ.ఎ.సి. డైరెక్టర్ ప్రొ.సతీష.కె.ఎస్, గోవింద వాక్యార్థ సభ కోఆర్డినేటర్స్ డా.శ్రీహరి దాయగుడే, డా. మనోజ్ షిండే, కులపతి వాక్యార్థసభ కోఆర్డినేటర్స్ ప్రొ.జి.శంకర నారాయణ, డా. భరత భూషణ్ రత్ మరియు విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించండి

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు రేణిగుంట పట్టణంలో గురువారం ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం రేణిగుంట మండలంలో విమానాశ్రయం, రైల్వే స్టేషన్, బస్టాండ్‌లతో పాటు మొత్తం 39 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. 22,23 తేదీల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్య అధికారి ద్వైత పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శుల, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, ఏఎన్ఎం లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వెయ్యాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ నాయక్, ఎంపీడీవో, కృష్ణమరాజు సిహెచ్ఓ, శిల్పా ఐసిడిఎస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - రామచంద్రాపురం: పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పల్స్ పోలియో విజయవంతం చేద్దామని ఎంపీడీవో పులిరాం సింగ్, కుప్పం బాదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ తేజస్విలు కోరారు. గురువారం పల్స్ పోలియో కార్యక్రమ పోస్టర్లపే ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ డిసెంబర్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో తల్లిదండ్రులు ప్రతి బిడ్డకు రెండు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో ప్రతి పంచాయతీలో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, వైద్య సిబ్బంది సుబ్రమణ్యం, మోహన్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన వారోత్సవాలు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 18 నుండి 24వ తేదీ వరకు వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రమణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం వినియోగదారుల అవగాహన చార్టు విద్యార్థులకు చూపించి కార్యక్రమం ప్రారంబించారు. డివిజినల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించనున్న పోటీలలో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. విజేతలకు నగదు బహుమతి అందిచన్నుట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమల్లంలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్



ప్రజాశక్తి -ఏర్పేడు : తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో గురువారం పెనుమల్లం విలేజ్ హెల్త్ సెంటర్లో ఉచిత మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు పాపానాయుడుపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.నాగరాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయని, బిపి, షుగరు, పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డా. టివిడి.ప్రత్యూష, డా. ఎం.లలిత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ జి.లావణ్య, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డా. హరిత, సెక్రటరీ హరికృష్ణ, పిహెచ్ ఎన్ ఎ.మంజులాదేవి, ఎంఎల్ హెచ్ పి ఎం.కవితా కుమారి, ఏఎన్ఎంలు జి.కుసుమ కుమారి, ఎం.తులసి పీహెచ్సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్యానం ఆరోగ్య పరిరక్షణలో కీలకం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : శారీరక, మానసిక ఆరోగ్యాల పరిరక్షణలో ధ్యానం (మెడిటేషన్) ప్రముఖ పాత్ర వహిస్తుందని విజయలక్ష్మి తెలిపారు. డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాల శాఖ ఆదేశాల మేరకు పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆరోగ్య పరిరక్షణకు ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థులు రోజూ కనీసం ఇరవై నిమిషాలు పాటు ధ్యానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య, డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ పి.సుజన, డాక్టర్ పి.హరిబాబు, డాక్టర్ మురళీమోహన్ రెడ్డి, డాక్టర్ ఏ.దేవకి, డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ తదితర అధ్యాపకులు, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.